క్లుప్తంగా

ఫ్లెక్సీపై రగడ

దమ్మపేట: మండలంలోని పూసుకుంట గ్రామంలో శనివారం నిర్వహించిన సమావేశం సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఫొటోలతో పాటుగా ఖమ్మం పార్లమెంటు సభ్యుడు రామ సహాయం రఘురాం రెడ్డి ఫొటో లేకపోవడంపై కొంతమంది కాంగ్రెస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఆందోళనకు దిగారు. ఎంపీ ఫొటో లేకుండా ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో సభా వేదికపైనే ఉన్న మంత్రి తుమ్మల కలగజేసుకుని.. అధికారుల తప్పిదమని, ఫ్లెక్సీలో ఫొటో లేదనే చిన్న కారణంతో సమావేశానికి ఆటంకం కలిగేలా ప్రవర్తించడం తగదని సూచించారు. దీంతో నాయకులు ఆందోళన సద్దుమణిగిపోయింది.

ఆర్థిక సాయం అందజేత

మణుగూరుటౌన్: బంగ్లాస్ ఏరియాలో పనిచేస్తున్న కార్మికుడు వెంకటనారాయణకు ఇటీవల చేతికి గాయం కాగా, జీఎం దుర్గం రాంచందర్ చేతులమీదుగా శనివారం రూ.16వేల ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్, సివిల్ విభాగం నుంచి ఈ ఆర్థిక సాయం అందించడం పట్ల జీఎం వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి అధికారులు పాల్గొన్నారు.

అనారోగ్య బాధితురాలికి..

భద్రాచలంఅర్బన్: భద్రాచలంకు చెందిన హోంగార్డు ఎం.సత్యనారాయణ సతీమణి రమ ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్‌కు గురి కావడంతో ఆమె చికిత్స నిమిత్తం వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట రామరాజు, ఉమ్మడి జిల్లా కన్వీనర్ వేగేశ్న శ్రీనివాస రాజు ఆర్థిక సాయం అందించారు. శనివారం రూ.10 వేలు విలువ గల చెక్కును ఆమె భర్త హోంగార్డు సత్యనారాయణకు భద్రాచలం అసిస్టెంట్ ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ చేతుల మీదుగా స్థానిక ఏఎస్పీ కార్యాలయంలో అందజేశారు. వసుధ ఫౌండేషన్ సభ్యులు పీవీ సత్యనారాయణ, ఎస్‌కె.షరీఫ్ పాల్గొన్నారు.

క్రీడాస్ఫూర్తిని చాటాలి

కరకగూడెం: క్రీడా కారులు ఎల్లప్పుడూ క్రీడాస్ఫూర్తిని చాటుతూ ముందుకు సాగాలని కరకగూడెం ఎస్సై రాజేందర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన శనివారం గొల్లగూడెం గ్రామంలో 'హజరత్ ఆలీబాబా జయంతిని'పురస్కరించుకుని ఏర్పాటు చేసిన భద్రాద్రి, ములుగు జిల్లాల స్థాయి వాలీబాల్ టోర్నీకి ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడారు. టోర్నీ నిర్వాహకులు ఫారూఖ్, శ్రీను, మొయిన్, గ్రామస్తులు గుండ్ల రంజిత్ కుమార్ సత్యం, నగేష్, గ్రామ యువత పాల్గొన్నారు.

సేవతోనే సార్థకత

చర్ల: సేవ చేయడంతోనే జీవితానికి సార్థకత చేకూరుతుందని హైకోర్టు అడ్వకేట్ సీవీ సతీష్‌కుమార్ పేర్కొన్నారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని తిమ్మిరిగూడెం ఆదివాసీ గ్రామంలో 73 కుటుంబాలకు నిత్యావసర వస్తువులు, కూరగాయాలు, దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతీ ఏటా ఇటువంటి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చీమలమర్రి మురళీకృష్ణ, తడికల లాలయ్య, కొవ్వూరొ వెంకట్రావు, ఆదివాసీ యువసేనా మండల అధ్యక్షులు మడకం చందు పాల్గొన్నారు.

వసతులు కల్పించండి

బూర్గంపాడు: ఉప్పుసాక గ్రామపంచాయతీలోని రాజీవ్‌నగర్ గ్రామంలో కనీస వసతులు కల్పించాలని సీపీఐ మండలశాఖ ప్రతినిధులు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును కోరారు. శనివారం సీపీఐ మండల కార్యదర్శి ముప్వ వెంకటేశ్వరరావు, సప్కా నాగేశ్వరరావుల ఆధ్వర్యంలో రాజీవ్‌నగర్ గ్రామస్తులు ఎమ్మెల్యేను కలిశారు. గ్రామంలో తాగునీరు, రోడ్లు, కరెంట్ సౌకర్యం లేదని ఎమ్మెల్యేకు వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే.. రాజీవ్‌నగర్‌లో కనీస వసతులు కల్పనకు కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

మణుగూరురూరల్: జాతీయ స్థాయి యోగాసనాలను వంద రోజుల పాటు విజయవంతం చేసినందుకు గానూ ప్రభుత్వ ఉపాధ్యాయులు వీవీ కోటేశ్వరరావు, కె.పరమయ్యలను పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శనివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పుష్పగుచ్ఛాలు, శాలువాలతో సన్మానించి జ్ఞాపికలతో సత్కరించారు. హాబిల్డ్ సంస్థచే ప్రపంచ రికార్డ్ ప్రశంసాపత్రం పొందిన ఉపాధ్యాయుడు కోటేశ్వరరావును ఆయన ప్రత్యేక అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పీరినాకి నవీన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వాల్ పోస్టర్లు ఆవిష్కరణ

ములకలపల్లి: లెనిన్ శత వర్ధంతి సభను విజయవంతం చేయాలని మాస్‌లైన్ జిల్లా కమిటీ సభ్యుడు పోతుగంటి లక్ష్మణ్ పిలుపునిచ్చారు, సభ గోడపత్రికను మండలపరిధిలోని జగన్నాథపురంలో శనివారం ఆయన ఆవిష్కరించారు. ఈ నెల 21న హైదరాబాద్‌లో నిర్వహించే సభకు భారీగా తరలిరావాలని కోరారు. మండలకమిటీ సభ్యుడు యర్రగొర్ల రామారావు, నాగేశ్వరరావు, నాయకులు రాజేశ్వరరావు, కృష్ణ, వెంకట్ పాల్గొన్నారు.

గగన వీధుల్లో తోక చుక్కలు!

- మార్కెట్‌కు పతంగుల కళ
- ఆకట్టుకుంటున్న వెరైటీలు
- మొదలైన సంక్రాంతి సందడి


భద్రాచలంలో రంగులు విక్రయిస్తున్న దృశ్యం



దుకాణాల్లో విక్రయానికి సిద్ధంగా ఉన్న విభిన్న రకాల పతంగులు

సండే స్పెషల్

భద్రాచలంఅర్బన్: పిల్లలు, పెద్దలను మురిపించే పతంగుల పండగ వచ్చేసింది. వేలాది వెరైటీల్లో తయారైన తెలంగాణ పతంగులు ఆకట్టుకుంటున్నాయి. పేపర్, వెదురు పుల్లలతో ఆధునిక డిజైన్లలో తయారు చేసిన తయారీ దారులకు పతంగులు ఉపాధి జోష్ కల్పిస్తున్నాయి. ముచ్చటగొలిపే డిజైన్లలో ఉన్న పతంగులు, పట్టణంలో పతంగులు ఆటలు.. క్రయ విక్రయాలపై సండే స్పెషల్ కథనం..

చిన్నా పెద్దా తేడా లేకుండా ప్రజలు ఎగురవేస్తున్న కలర్‌ఫుల్ కైట్లు అదుర్స్ అనిపిస్తున్నాయి. హైదరాబాద్ తో పాటు ఇతర ప్రాంతాల్లో తయారయ్యే పతంగులను స్థానిక వ్యాపారులు వాటి డిమాండ్ కు తగ్గట్టు తెప్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో స్థానికంగానే ఎన్నో వెరైటీల్లో పతంగులు లభిస్తున్నాయి. దీంతో భద్రాచలం పట్టణంలో పండుగ రాక ముందే నుంచే పతంగుల ఆటలతో సందడి నెలకొంది. పిల్లలు మెచ్చేలా అన్ని వెరైటీల్లో దొరుకుతుండటంతో పతంగుల అమ్మకాలు పెరిగాయి.

భద్రాచలం పట్టణంలోని మార్కెట్, యూబీ రోడ్డు, చర్ల రోడ్డు, ఐటీడీఏ రోడ్డుతో పాటు తదితర ఏరియాల్లో పతంగుల దుకాణాల్లో కస్టమర్లు కొనుగోలు చేస్తుండటంతో సందడి నెలకొంది.

విభిన్న రకాల్లో..

సాధారణ కాగితం, వెదురు పుల్లలతో చేసినవే కాకుండా క్లాత్, ప్లాస్టిక్ పేపర్లు, సిల్వర్, గోల్డ్ రంగు రంగుల పతంగులు అమ్మ కాలు భద్రాచలం పట్టణంలో జోరుగా సాగుతున్నాయి. గాలిపటాలను తోకపతంగి, ఫిష్కాట్, రంగీలా, జరీ, బట్ట, సిల్వర్, గోల్డ్, ఈగల్, డేగ, ట్రెయాంగిల్, డ్రాగన్, కార్టూన్ లవర్స్, లవ్ బర్డ్స్, బటర్‌ఫ్లైతో పాటు సాధారణ పతంగులు భద్రాచలంలో దొరుకుతున్నాయి. పతంగులు ఎగర వేయడానికి దారాలు, దానిని చుట్టేందుకు అందమైన చెరకాలు ప్లాస్టిక్, కర్రలతో చేసినవి లభిస్తున్నాయి. కాటన్ దారాలు, మాంజా దారాలు కూడా వెరైటీల్లో అమ్ముతున్నారు.

రూ.5 నుంచి రూ.400 వరకు..

భద్రాచలం పట్టణంలో రూ.5 మొదలుకుని రూ.400 విలువైన పతంగులు అమ్ముతున్నారు. హోల్‌సేల్ అండ్ రిటేల్ ధరలకు విక్రయిస్తున్నారు. దారాలు రూ.2 నుంచి రూ.40, కాటన్ దారాలు రూ.5 నుంచి రూ.40, దారం చెరకలు రూ.30 నుంచి రూ.80, బట్టపతంగి రూ.60 నుంచి రూ.300, లాంథర్ రూ.30 నుంచి రూ. 50, డ్రాగన్ రూ.300, డేగ రూ.150, బటర్‌ఫ్లై రూ.150, ట్రై యాంగిల్ రూ.60 నుంచి రూ.300, సాధారణ పతంగులు రూ.2 నుంచి రూ.50 ధరల్లో లభ్యమవుతున్నాయి.

మార్కెట్‌కు రంగుల కళ..

ప్రస్తుతం సంక్రాంతి పండుగ దగ్గర పడడంతో ముగ్గులు వేసే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. సోషల్ మీడియా విస్తృతం కావడంతో ముగ్గులపై మహిళలకు క్రేజ్ మరింతగా పెరిగింది. ఫలితంగా మార్కెట్లలో ముగ్గులు వేసేందుకు అవసరమైన రంగుపొడుల విక్రయాలు మొదలయ్యాయి. ముగ్గులు వేసేందుకు మహిళలు, యువతులు రంగుల ముగ్గు పొడులను ఇష్టంగా కొంటున్నారు. ముగ్గులు వేసే సీజన్ సంవత్సరంలో ఇదే గనుక తమ కళా ప్రతిభను ప్రదర్శించి రంగురంగుల ముగ్గులను తమ ఇంటి ముంగిళ్లలో తీర్చి ఇతరులను ఆకట్టుకునేందుకు ఎంతో కృషి చేస్తున్నారు. ముగ్గులు వేసేందుకు అవసరమైన ముగ్గుపొడి, రంగులను విక్రయించేందుకు భద్రాచలం మార్కెట్లో దాదాపు 20కి పైగా దుకాణాలు వెలిశాయి. తెల్ల ముగ్గు పిండి తో పాటు రంగులు కలిపిన ముగ్గుపిండికి కూడా డిమాండ్ ఏర్పడింది.

జాగ్రత్తలు పాటిస్తాం



పెద్దలు చెప్పినట్లుగా కైట్స్ ఎగురవేసేప్పుడు జాగ్ర త్తలు పాటిస్తాం. సంక్రాంతి వచ్చిందంటే పతం గులు ఆడుతూ స్నేహితులతో సరదాగా గడుపుతాం. గాలిలో పతంగులు ఎగురుతుంటే స్నేహితులతో కలిసిసంతోషప డతాం. చిన్నప్పటి నుంచి కైట్స్ ఎగురవేయడం చాలా ఇష్టం.

–రోహన్ వర్షిత్ రెడ్డి, భద్రాచలం

సరదాగా ఎగురవేస్తున్నాం..



సంక్రాంతి పండుగకు ఫ్రెండ్స్‌తో కలిసి గాలిపటాలు ఎగురవేయడం సరదాగా ఉంటుంది. వెరైటీ డిజైన్లలో కైట్స్ అమ్ముతున్నారు. ధరలు కూడా తక్కువే. మార్కెట్లో దిరుకుతున్న కైట్లు క్రేజీగా ఉన్నాయి. బొమ్మలు, పక్షులు రూపాలతో గాలిపటాలు అందంగా ఉన్నాయి, ధరలు కూడా తక్కువే.

– సాయి సంజీత్, భద్రాచలం

జాగ్రత్త వహించాలి..



గాలిపటాల దారం తెగి చెట్లు, విద్యుత్ స్తంభాలు, తీగలకు చిక్కుకున్నప్పుడు కర్రలతో కొట్టడం ప్రమాదకరం. ట్రాన్స్‌ఫార్మర్లు, వేలాడుతున్న విద్యుత్ తీగలు వద్ద పతంగులు ఎగురవేయనివ్వకూడదు. విద్యుత్ సమస్య తలెత్తితే వెంటనే 1912ను సంప్రదించాలి.

– జీవన్ కుమార్, విద్యుత్ శాఖ డీఈ, భద్రాచలం

ఏటీఎఫ్ క్యాలెండర్లు ఆవిష్కరణ


క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జారే

దమ్మపేట: ఆదివాసీ టీచర్స్ ఫెడరేషన్(ఏటీఎఫ్) నూతన సంవత్సర క్యాలెండర్‌ను స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆవిష్కరించారు. శనివారం మండలంలోని గండుగులపల్లి క్యాంపు కార్యాలయంలో ఏటీఎఫ్ నాయకులు, ఎమ్మెల్యే జారేను మర్యాదపూర్వకంగా కలసి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియయజేశారు. ఏటీఎఫ్ నాయకులు, ఆదివాసీ ఉద్యోగుల పలు సమస్యలను ఎమ్మెల్యేకు తెలియజేయగా.. పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వాసం రాణి, ఏటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కుర్సం రామారావు, గౌరవ సలహాదారులు మెచ్చు వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి సోయం శ్రీనివాసరావు, పద్దం వెంకటేశ్వరరావు, రమేష్, శ్రీనివాస్, రాంరెడ్డి పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

అశ్వారావుపేటరూరల్: సంక్రాంతి పండుగ సందర్భంగా వాసవీక్లబ్ ఆధ్వర్యంలో శనివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. అశ్వారావుపేటలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో నిర్వహించిన ఈ పోటీల్లో మహిళలు, యువతులు హాజరై వివిధ రకాల ముగ్గులు వేసి ఆకట్టుకున్నారు. అనంతరం విజేతలకు వాసవిక్లబ్ ఆధ్వర్యంలో విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ బాధ్యులు శీమకుర్తి సుబ్బారావు, జల్లిపల్లి దేవరాజ్, సత్యవరపు బాలయ్య, బోగవల్లి రాంబాబు, కోరుకొండ మోహన్ పాల్గొన్నారు.


అశ్వారావుపేటరూరల్: విజేతకు బహుమతి అందిస్తున్న వాసవీక్లబ్ బాధ్యులు

నేడు మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో..

అశ్వారావుపేటరూరల్: మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో నేడు(ఆదివారం) సంక్రాంతి పండుగ నేపథ్యంలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కురిశెట్టి నాగబాబు, కట్టా శ్రీను తెలిపారు. అశ్వారావుపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగే పోటీలకు మహిళలు, యువతులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. విజేతలకు స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ చేతుల మీదుగా బహుమతులు అందించనున్నట్లు చెప్పారు.

పూర్వ విద్యార్థుల 3కే రన్


పినపాక: 3కే రన్‌లో పాల్గొన్న పూర్వ విద్యార్థులు


ములకలపల్లి: నాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

పినపాక: ఏడూళ్లబయ్యారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో శనివారం ఘనంగా 3కే రన్ నిర్వహించారు. బయ్యారం క్రాస్ రోడ్డు నుంచి ప్రభుత్వ పాఠశాల వరకు సాగిన రన్ కార్యక్రమాన్ని ఐఆర్‌ఎస్ రాయ వెంకటేశ్వరరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1975 నుంచి ఇప్పటివరకు 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పాఠశాలలో చదివిన విద్యార్థులు 5 దశాబ్దాల ఉత్సవం నిర్వహించారు. అందులో భాగంగా గత నాలుగు రోజులుగా క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. పూర్వ విద్యార్థుదరూ కలిసి ఐకమత్యతతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచేందుకు 3కే రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో సందడి వాతావరణం నెలకొంది.

ములకలపల్లి: బాల్యమిత్రులు 22 యేళ్ల తరువాత మళ్లీ కలిశారు. గత స్మృతులను నెమరువేసుకున్నారు. టీచర్లకు ఆత్మీయ సత్కారం చేశారు. జగన్నాథపురం ఉన్నత పాఠశాలలో 2002–03 పదో తరగతి విద్యార్థులు శనివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు, స్థానిక రైతువేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ.. నాటి విషయాలు జ్ఞప్తికి తెచ్చుకున్నారు. నాటి హెచ్‌ఎం ఎంఎల్‌ఎస్ చారికాం, ఉపాధ్యాయులు గాదె మదన్‌మోహన్ రెడ్డి, జానకిరామ్, రామారావు, పుష్పావతి, సీత, శివలను దుశ్శాలువతో సత్కరించారు, జ్ఞాపికలు బహూకరించారు, నాటి సంగతులు గుర్తు చేసుకొని, బరువెక్కిన హృదయాలతో ఇళ్లకు పయనమయ్యారు. విద్యార్థిబృందం నందిగం అశోక్‌వర్ధన్, లగడపాటి నరేశ్, మోహన్‌బాబు, ఇందిర, నీరజ, చైతన్య అనిత, రూతు, వాణి తదితరులు పాల్గొన్నారు.

రైతుల అభివృద్ధే ధ్యేయం

మణుగూరురూరల్: తెలంగాణ రాష్ట్రంలోని రైతుల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర మార్క్ ఫెడ్ డైరెక్టర్, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. మండల పరిధిలోని పగిడేరు గ్రామపంచాయతీలో డీసీఎంఎస్ ద్వారా నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన శనివారం సందర్శించి తూకం వేసే విధానాన్ని, తూర్పార పట్టడం, లారీలలో ధాన్యం రవాణా వంటి అంశాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని రైతుల శ్రేయస్సు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. రైతుల అభివృద్ధికి పెద్దపీటవేస్తూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఒకే దఫా రూ.2లక్షల రుణ మాఫీ చేసి తిరిగి రుణాలను అందిస్తోందన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ జిల్లా ఇన్‌చార్జ్‌లు గౌర స్వరూప, సరెడ్డి రవి, దాసరి రవితేజ, పగిడేరు మాజీ సర్పంచ్ తాటి బిక్షం, పాల్వంచ కాంగ్రెస్ నాయకులు కొండం వెంకన్న, దారా చిరంజీవి, పులి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీల అభ్యున్నతికి పాటుపడాలి

చర్ల: స్వాతంత్ర్య పోరాటంలో ఆదివాసీలదే కీలకపాత్ర అని, అటువంటి ఆదివాసీల అభ్యున్నతి కోసం ప్రతి ఒక్కరూ పాటు పడాలని ప్రముఖ ప్రవచనకర్త రాకా సుధాకర్ అన్నారు. చర్లలో వనవాసీ కల్యాణ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొమరంభీం విద్యార్థి నిలయం 12వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం విద్యాలయంలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడారు. సీఐ ఏ రాజువర్మ, ఎస్సై నర్సిరెడ్డి, శిక్షణ ఎస్సై విజయ సింహారెడ్డి, వనవాసీ కల్యాణ పరిషత్ ప్రతినిధులు పాల్గొన్నారు.

వేం నరేందర్‌రెడ్డిని కలిసిన కేశవరెడ్డి

అశ్వాపురం: మహబూబాబాద్ జిల్లా కేసముద్రంలోని నివాసంలో ముఖ్యమంత్రి సలహాదారుడు వేంనరేందర్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గాదె కేశవరెడ్డి శనివారం మర్యాద పూర్వకంగా కలిసి పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు.

ఘనంగా ఓబన్న జయంతి

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని ఆదర్శనగర్ కాలనీలో వడ్డెర సంఘం ఆధ్వర్యంలో వడ్డే ఓబన్న జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్‌కట్ చేసి పంపిణీ చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో పలువురు వక్తలు మాట్లాడుతూ.. స్వాతంత్ర ఉద్యమంలో ఆయన చేసిన వీరోచిత పోరాటిలను గుర్తు చేసుకుని, దేశ విముక్తికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో గుంజా చున్నకేశవ, సాయి, రామకృష్ణ, సంతోష్, సమయ్య, వీరన్న పాల్గొన్నారు.

ఘనంగా కూడారై ఉత్సవం

దుమ్ముగూడెం: పర్ణశాల శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం, లక్ష్మీనగరం శ్రీ దాసాంజనేయ స్వామి ఆలయంలో ధనుర్మాసంలో జరుగు కూడారై మహోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. పర్ణశాలలో ప్రధాన అర్చకులు శేషం కిరణ్‌కుమార్‌చార్యులు, భార్గవాచార్యులు గోదా అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం 108 గిన్నెలలో ప్రత్యేకంగా తయారుచేసిన ప్రసాదాన్ని అమ్మవారికి నివేదన చేసి అనంతరం భక్తులకు అందజేశారు. ఆలయ ఇన్‌చార్జ్ అనిల్‌కుమార్, లక్ష్మీనగరం ఆలయ అర్చకులు ఆరుట్ల రాజగోపాల్‌చార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాలాజీ దేవస్థానంలో..

అన్నపురెడ్డిపల్లి(చండ్రుగొండ): మండలకేంద్రం అన్నపురెడ్డిపల్లిలో ఉన్న శ్రీ బాలాజీ వెంకటేశ్వరస్వామి దేవస్థానలో ధనర్మాస ఉత్సవాల్లో భాగంగా శనివారం కూడారై ఉత్సవం నిర్వహించారు. వేద పండితులు ప్రసాదాచార్యులు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఆలయ మేనేజర్ పీవీ రమణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో..

చండ్రుగొండ: మండలకేంద్రం చండ్రుగొండలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో కుడారై వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. మహిళా భక్తులు పాల్గొని పూజలు చేశారు. ప్రధాన పూజారి బోడెం వెంకన్నశాస్త్రి పూజలు జరిపించారు.


అన్నపురెడ్డిపల్లి: కుడారై ఉత్సవంలో పాల్గొన్న భక్తులు


చండ్రుగొండ: వేణుగోపాలస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు

కల్యాణ మండపానికి శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్వర్లు, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు

మణుగూరుటౌన్: అన్ని వర్గాలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం గుట్టమల్లారంలో సీఎస్ఆర్ నిధుల రూ.50లక్షల వ్యయంతో నిర్మించనున్న మున్నూరు కాపు కల్యాణ మండపం శంకుస్థాపనకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావుతో కలిసి మాట్లాడారు. మున్నూరు కాపు కులస్థులు గతకొన్ని సంవత్సరాలుగా కమ్యూనిటీహాల్ నిర్మాణానికి నిరంతరం కృషి చేస్తున్నారని, వారి కలను నెరవేర్చే అవకాశం దక్కడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అతిథులను సంఘం సభ్యులు ఘనంగా శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాఘవరెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసరావు, పీఆర్‌డీ సత్యనారాయణ, ఏఈ రామారావు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పీరినాకి నవీన్, మండల మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు వనం కృష్ణ మోహన్, కార్యదర్శి గాండ్ల సురేశ్, నాగేశ్వరరావు, మామిడిపల్లి సీతారాములు, వలసాల వెంకటరామారావు, గాజుల రమేశ్, అడపా వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామానికి చెందిన బోధ కార్తిక్‌రెడ్డికి సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరు అయిన చెక్కును మణుగూరులో క్యాంపు కార్యాలయంలో శనివారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కమటం నరేష్, పర్వత నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి..

మండల పరిధిలోని గొందిగూడెం గ్రామ పంచాయతీలోని గతంలో తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఆధ్వర్యంలో నిర్మించిన వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఇటీవల ధ్వజస్తంభం కూలిపోయిందని, నీటి సదుపాయం లేదని భక్తులు ఇబ్బందులు పడుతున్నారని గొందిగూడెం, తుమ్మలచెరువు గ్రామ పంచాయతీలకు చెందిన తిరుపతమ్మ మాల ధారణ భక్తులు శనివారం మణుగూరులో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును కలిసి వినతిపత్రం అందజేశారు. ఉమ్మడి గొందిగూడెం, తుమ్మలచెరువు, వెంకటాపురం గ్రామ పంచాయతీలకు ఇది ఒక్కడే ఆలయమని భక్తుల సౌకర్యార్థం ఆలయంలో బోరు వేయించాలని, ధ్వజస్తంభం పునర్మిణానికి సహకరించాలని ఎమ్మెల్యేను కోరారు. తక్షణమే బోరు వేయిస్తానని ఎమ్మెల్యే భక్తులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గొంది గోపాలకృష్ణ, పాయం సర్వేశ్వరరావు, కందుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తుమ్మల పరామర్శ

దమ్మపేట: అనారోగ్యంతో బాధపడుతున్న పలువురిని, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం పరామర్శించారు. మండలంలోని నాగుపల్లి గ్రామంలో నీలం రెడ్డి, పొనగంటి వెంకయ్య అనారోగ్యంతో బాధపడుతుండగా, విషయం తెలుసుకున్న మంత్రి తుమ్మల వారిని పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని కుటుంబ సభ్యుల ద్వారా వాకబు చేసి, ధైర్యంగా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో కాసాని నాగప్రసాద్, దొడ్డా ప్రసాద్, ఇస్లావత్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

తుమ్మలను కలిసిన నాయకులు


ములకలపల్లి: వ్యవసాయశాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావును మండలానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. దమ్మపేట మండలంలోని పూసుకుంట గ్రామానికి వస్తున్న మంత్రి తుమ్మలను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్‌రావు, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు గుంపుల రవితేజ, నాయకులు పర్వతనేని అమర్‌నాథ్ కలిసి సాదరంగా స్వాగతం పలికారు. మండల సమస్యలు విన్నవించారు. పువ్వాల మంగపతి, కరుటూరి కృష్ణ, బాల అప్పారావు, అడపా నాగేశ్వరరావు, గాడి తిరుపతిరెడ్డి, కారం సుధీర్ ఉన్నారు.



దమ్మపేట: బాధితుడిని పరామర్శిస్తున్న మంత్రి తుమ్మల

ముందస్తు సంక్రాంతి వేడుకలు

మణుగూరుటౌన్: పట్టణంలోని పలు ప్రైవేట్ పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలను అందంగా అలంకరించి సంక్రాంతి ముగ్గులు, గొబ్బెమ్మలతో తెలుగు ఇంటి సంస్కృతి సాంప్రదాయాలు ఉట్టిపడేలా కార్యక్రమాన్ని విద్యార్థులతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లేస్కూల్స్‌లో విద్యార్థుల తల్లిదండ్రులను భాగస్వాములను చేశారు. ఎక్సలెంట్ స్కూల్ గ్రూప్స్‌లలో ఇటీవల మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో ప్రతిభ ప్రదర్శించి జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులు ప్రియవర్షిణి, జవేదాలను, టీచర్ వెంకట్‌లను యాజమాన్యం ఘనంగా సన్మానించారు. సంక్రాంతి వేడుకల్లో భాగంగా విద్యార్థుల వేషధారణలు ఆకట్టుకోగా, భోగిమంటలు వేసి విద్యార్థులతో చుట్టూ ఆడిపించారు. మాంటిస్సోరి స్కూల్‌లో విద్యార్థుల చేత గాలిపటాలు ఎగురవేసి రంగు రంగుల ముగ్గులు వేయించారు. విద్యార్థుల వేషధారణలు ఆకట్టుకోగా, ఆటపాటలు ప్రదర్శించి అలరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఐసా తామస్ సంక్రాంతి పండుగ విశిష్టతను వివరించారు. బ్రైట్ మైండ్స్ ప్లే స్కూల్‌లో ప్రిన్సిపాల్ రాంబాబు, రమల ఆధ్వర్యంలో ఘనంగా సంక్రాంతి వేడుకలు నిర్వహించి చిన్నారుల తల్లిదండ్రులతో రంగురంగుల ముగ్గులు వేయించి విజేతలకు బహుమతులు అందజేశారు.

బూర్గంపాడు: మండలంలోని ప్రైవేటు పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు ఉత్సాహంగా సాగాయి.బూర్గంపాడులోని న్యూసెంచరీ స్కూల్‌లో, సారపాకలోని బ్రిలియంట్ స్కూల్‌లో శనివారం ముందస్తు సంక్రాంతి సంబరాలు జరిగాయి. విద్యార్థులు ముగ్గులు పెట్టి, ఆటపాటలతో సందడి చేశారు. సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా రంగవల్లులు, భోగిమంటలు, పతంగులు, గంగిరెద్దుల విన్యాసాలతో సంక్రాంతి శోభను తీసుకువచ్చారు. అయా కార్యక్రమాలలో బ్రిలియంట్ విద్యాసంస్థల కరస్పాండెంట్ బి నాగేశ్వరరావు, న్యూసెంచరీ స్కూల్ కరస్పాండెంట్ లైక్ ఆషిక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


బూర్గంపాడు: సారపాక బ్రిలియంట్ స్కూల్‌లో సంక్రాంతి సంబురాలు


మణుగూరుటౌన్: ఎక్సలెంట్ పాఠశాలలో సంబురాలు..